ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్

EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 321 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-

సోమవారం 23 జూన్ 2025

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

రాజధానిలో భూకేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ

ఏపీ సచివాలయంలో భూ కేటాయింపుల అంశంపై మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. మంత్రులు నారాయణ, టీజీ భరత్ హాజరయ్యారు.

అమరావతి, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ సచివాలయంలో భూ కేటాయింపుల అంశంపై మంత్రివర్గ ఉప సంఘం సమావేశమైంది. మంత్రులు నారాయణ, టీజీ భరత్ హాజరయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. రాజధానిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు.



రాజధాని ప్రాంతంలో 16 అంశాల భూకేటాయింపుల అజెండాపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించిందని మంత్రి నారాయణ తెలిపారు. వీటిలో 12 అంశాలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. ఇప్పటి వరకు కేటాయించిన భూముల్లో 6 నెలల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చూస్తున్నామన్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటివరకు ఇచ్చిన అన్ని వర్క్ టేకాఫ్ అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం అమరావతిలో 10వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు.

ఏపీ విద్యావ్యవస్థలో కూటమి ప్రభుత్వం గొప్ప సంస్కరణలు తీసుకొచ్చింది:మంత్రి లోకేశ్

కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో గొప్ప సంస్కరణలను తీసుకువచ్చిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.

బాపట్ల, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో గొప్ప సంస్కరణలను తీసుకువచ్చిందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లులో మంత్రి లోకేశ్ పర్యటించారు. ఇంకొల్లులోని గంగవరం రహదారిలోని మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు నిర్మించిన డీవీఆర్ సైనిక్ స్కూల్ను లోకేశ్ ప్రారంభించారు. విలువలతో కూడిన విద్యను అందించడం కోసమే ఈ సైనిక్ స్కూల్ ప్రారంభించినట్లు ఎంపీ పురందేశ్వరి తెలిపారు.

అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు దేశభక్తిని అలవరుచుకోవాలని సూచించారు. "ఏపీకి పెద్ద ఎత్తున సీఎం చంద్రబాబు పెట్టుబడులు తీసుకువస్తున్నారు. రాబోయే కాలంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. అన్ని రంగాల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంచేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారు. రాజకీయాల్లో మార్పు రావాలంటే యువత రాజకీయాల్లోకి రావాలి" అని మంత్రి లోకేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు సాంబశివరావు, ఎంఎం కొండయ్య యాదవ్, నరేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా సంబరాలు చేపట్టాలి:డిప్యూటీ సీఎం భట్టి

రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

హైదరాబాద్, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు.

గాంధీభవన్లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. రైతు భరోసా కింద నిధులను రైతుల ఖాతాల్లో ఈ నెల 16 నుంచి జమ చేస్తున్నామని.. ఇది జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.

కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ

కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.

తదుపరి విచారణను సీజే ధర్మాసనం 3 వారాలకు వాయిదా వేసింది.

హైదరాబాద్, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను సీజే ధర్మాసనం 3 వారాలకు వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను గతంలో టీజీఐఐసీకి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది.

భూమిని అభివృద్ధి చేసి ఐటీ కంపెనీలకు కేటాయించేలా టీజీఐఐసీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈక్రమంలో భూములను జేసీబీలతో చదును చేసింది. దీన్ని అడ్డుకోవాలంటూ హైకోర్టులో వేర్వేరుగా 4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వాదనల సందర్భంగా.. టీజీఐఐసీకి భూమిని అప్పగిస్తూ జారీ చేసిన జీవోను రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. సుప్రీంకోర్టులో దీనిపై విచారణ ఉండటంతో.. హైకోర్టు 3 వారాలకు వాయిదా వేసింది.

2018 ఎన్నికల నుంచే ఫోన్ ట్యాపింగ్... సిట్‌కు లభ్యమైన ఆధారాలు

తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

హైదరాబాద్, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2018 ఎన్నికల వేళ ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులకు తాజాగా ఆధారాలు లభించాయి.

ప్రణీత్రావు నుంచి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్రావుకు ట్యాపింగ్ సమాచారం చేరేది. ప్రభాకర్ రావు ఆదేశాలతోనే టాస్క్ ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే ప్యారడైజ్ వద్ద భవ్య ఆనంద్ ప్రసాద్కు చెందిన రూ. 70లక్షల డబ్బును టాస్క్ ఫోర్స్ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఎన్నికల్లో పోటీ చేసిన రఘునందన్రావు బంధువులకు చెందిన రూ. కోటి కూడా ఫోన్ ట్యాపింగ్తో వచ్చిన సమాచారం మేరకే సీజ్ చేశారని తెలుస్తోంది. బేగంపేట పరిధిలో రాధాకిషన్రావు, ఆయన బృందం రూ. కోటి సీజ్ చేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సమాచారం. నల్గొండ కాంగ్రెస్ నేతల అనుచరుల నుంచి రూ.3.50 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇమ్మాంతో ఘటన...

ల్యాండింగ్ కాకుండానే దిల్లీకి తిరిగొచ్చేసిన ఎయిర్ ఇండియా విమానం

దిల్లీ నుంచి శ్రీనగర్కు బయల్దేరి వెళ్లిన ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అవ్వకుండానే తిరిగి వచ్చేయడం చర్చనీయాంశంగా మారింది.



జమ్మూ, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): దిల్లీ నుంచి శ్రీనగర్కు బయల్దేరి వెళ్లిన ఎఐయిర్ ఇండియా విమానం ల్యాండ్ అవ్వకుండానే తిరిగి వచ్చేయడం చర్చనీయాంశంగా మారింది. జమ్మూ మీదుగా శ్రీనగర్ వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ IX-2564 సోమవారం మధ్యాహ్నం జమ్మూలో ల్యాండ్ కాకుండానే తిరిగి దిల్లీకి వచ్చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, ఈ పరిస్థితికి దారితీసిన తక్షణ కారణాలు ఏంటనేది మాత్రం తెలియరాలేదని పేర్కొన్నారు. శ్రీనగర్ కన్నా ముందు ఈ విమానం జమ్మూలో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, పైలట్ ల్యాండింగ్ చేయకుండా ఢిల్లీకి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకొనే ముందు జమ్మూ విమానాశ్రయం పైనే కాసేపు చక్కర్లు కొట్టినట్లు అధికారులు తెలిపారు. వాతావరణం, రన్వే క్లియర్గానే ఉన్నప్పటికీ.. పైలట్ ల్యాండింగ్ ప్రాంతాన్ని గుర్తించలేకపోయాడని పేర్కొన్నారు.

ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష

రక్షణ, అంతరిక్ష రంగంలో రాష్ట్రం భారీగా పెట్టుబడులు సాధించేలా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అమరావతి, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): రక్షణ, అంతరిక్ష రంగంలో రాష్ట్రం భారీగా పెట్టుబడులు సాధించేలా ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నూతనంగా తీసుకొచ్చే పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో రూ.50వేల కోట్ల నుంచి రూ. లక్ష కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.



క్లస్టర్ల వారీగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రచించాలని ఆదేశించారు. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 4.0పై సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రక్షణ, ఏరోస్పేస్ రంగంలో నూతన సాంకేతికత, నవీన ఆవిష్కరణలకు రాష్ట్రం కేంద్రబిందువుగా మారేలా ప్రయత్నించాలన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత దేశం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించిందని, రానున్న రోజుల్లో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ తరహా సాంకేతికతను రక్షణ పరంగా వాడుకోవడంతోపాటు వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి చేసి.. దైనందిన జీవితంలో కూడా ఉపయోగపడేలా తీర్చి దిద్దాలని సూచించారు. ఏరోస్పేస్, అండ్ డిఫెన్స్ సలహాదారు సతీశ్డ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షకు హాజరై పలు సూచనలు చేశారు.

ప్రారంభమైన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.. పలు అంశాలపై చర్చ

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది.

హైదరాబాద్, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది. సచివాలయంలో జరుగుతోన్న ఈ సమావేశానికి కొత్తగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి క్యాబినెట్ భేటీకి హాజరయ్యారు. వానాకాలం పంటలకు రికార్డుస్థాయిలో రైతు భరోసా పంపిణీ, రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణ, స్పోర్ట్స్ పాలసీ, కాళేశ్వరం ప్రాజెక్టు, ఏపీ తలపెట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి తదుపరి కార్యాచరణపై మంత్రివర్గం చర్చించనుంది.

శ్రీశైలంలో బాంబులు, బుల్లెట్ల కలకలం

శ్రీశైలంలో బాంబులు, బుల్లెట్ల కలకలం రేగింది. వాసవీ సత్రం ఎదురుగా ఉన్న డివైడర్పై ఇవి కనిపించాయి.

శ్రీశైలం, జూన్ 23, (రిపబ్లిక్ న్యూస్): శ్రీశైలంలో బాంబులు, బుల్లెట్ల కలకలం రేగింది. ఆలయం సమీపంలోని వాసవీ సత్రం ఎదురుగా ఉన్న డివైడర్పై వీటిని గుర్తించారు. సోమవారం మధ్యాహ్నం సత్రం ముందునుంచి వెళ్తున్న కొందరు స్థానికులు డివైడర్ వద్ద ఉన్న సంచిని గమనించారు. అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న శ్రీశైలం పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది సంచిని తనిఖీ చేసి అందులో బుల్లెట్లు ఉన్నట్లు గుర్తించారు. సంచిలో 9 పెద్దవి, 4 చిన్న బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. మరో 4 బాంబులను కూడా గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసు స్టేషన్కు తరలించారు.

సంచిలో బుల్లెట్లు ఎవరు వదిలి వల్లి ఉంటారనే కోణంలో శ్రీశైలం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రీశైల క్షేత్రంలో దేవస్థానానికి చెందిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1696:** ప్రపంచంలో మొట్టమొదటి సాయంకాలపు దినపత్రిక 'డాక్స్ న్యూస్' వెలువడింది.
- **1935:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు జననం. (చిత్రంలో)
- **1953:** జనసంఘ్ పార్టీ స్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ కాశ్మీర్ లోని చెరసాలలో మరణం (జ.1901).
- **1937:** భావకవి, నాటక రచయిత కొంపెల్ల జనార్దనరావు మరణం (జ.1907).
- **1980:** భారత మాజీ రాష్ట్రపతి వి.వి.గిరి మరణం (జ.1894).
- **1980:** సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణం (జ.1948).
- **1980:** వెస్ట్ఇండీస్ కు చెందిన క్రికెట్ క్రీడాకారుడు రాంనరేష్ శర్వాన్ జననం.
- **1985:** భారతదేశానికి చెందిన చర్మ సాంకేతిక శాస్త్రవేత్త వై.నాయుడమ్మ కనిష్క విమాన ప్రమాదంలో మరణం (జ.1922).
- **1953:** జాస్తి చలమేశ్వర్, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జననం.

నాదెండ్ల భాస్కరరావు

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

కొంపెల్ల జనార్దనరావు


వి.వి.గిరి

సంజయ్ గాంధీ

రాంనరేష్ శర్వాన్

వై.నాయుడమ్మ

జాస్తి చలమేశ్వర్

నవ్విస్తూనే.. ఏడిపిస్తుంది..

ఆమిర్ సినిమాపై మహేశ్ ప్రశంసలు

ఆమిరాఖాన్ నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' చూసిన మహేశ్ బాబు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'సితారే జమీన్ పర్. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా అందరి హృదయాలను కదిలించేస్తోంది. ఇప్పటికే నెట్టింట ప్రశంసలు అందుకున్న ఈ సినిమాకు మహేశ్ బాబు కూడా ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా దీనిపై పోస్ట్ పెట్టారు. "అద్భుతమైన సినిమా. ఆమిర్ ఖాన్ ఇతర క్లాసిక్ సినిమాల్లాగానే 'సితారే జమీన్ పర్' కూడా మిమ్మల్ని నవ్విస్తుంది. ఏడిపిస్తుంది, చప్పట్లు కొట్టేలా చేస్తుంది. 'సితారే జమీన్ పర్' చూశాక కచ్చితంగా చిరునవ్వుతో బయటకు వస్తారు" అంటూ చిత్రబృందాన్ని అభినందించారు. ఈనెల 20న ప్రేక్షకుల ముందుకువచ్చిన 'సితారే జమీన్ పర్' సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరి మనసులను దోచుకుంటోంది. విడుదలకు ముందు ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రదర్శనల్లోనే పలువురు ప్రముఖులు దీనిపై ప్రశంసలు కురిపించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, బాలీవుడ్ హీరో షారుకాఖాన్, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి దీనిపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా సమాజంలో మార్పు తీసుకురాగలదని అభిప్రాయం వ్యక్తంచేశారు. మానసిక దివ్యాంగులను ఎవరూ తక్కువ చేసి చూడకూడదనే సందేశాత్మక చిత్రమిదన్నారు. 'తారే జమీన్ పర్కు సీక్వెల్గా వచ్చిన చిత్రమిది. మానసికంగా సవాళ్లు ఎదుర్కొంటున్న వాళ్లకు ఓ కోచ్ బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చి, వాళ్లను మేటి ఆటగాళ్లుగా తీర్చిదిద్దే ఇతివృత్తంగా రూపొందింది. ఆమిరాఖాన్ ఇందులో కోచ్గా కనిపించి సినీప్రియులను ఆకట్టుకుంటున్నారు.

అనుపమ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ నిరాకరణ!

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరించింది.



కేంద్రమంత్రి, నటుడు సురేశ్ గోపి, నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ. దీనికి సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ నిరాకరించడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. జానకి అనే మహిళ చేసే న్యాయపోరాటం చుట్టూ తిరిగే కథగా దీన్ని ప్రవీణ్ నారాయణ్ తెరకెక్కించారు. సీతాదేవి మరో పేరైన జానకిని అలాంటి పాత్రకు పెట్టకోలేమని పేర్కొంటూ ఈ చిత్రం స్క్రీనింగ్కు అనుమతి నిరాకరించినట్లు సినీ వర్గాలు తెలిపాయి. అలాగే ఈ సినిమా ప్రదర్శనకు సెన్సార్ బోర్డు అనుమతి నిరాకరించిందని దర్శకుడు కూడా వెల్లడించారు. ఇక ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ దర్శకుడు ఉన్ని కృష్ణన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సినిమాలో జానకి అనే పేరును ఉపయోగించరాదని సెన్సార్ బోర్డు ఈ చిత్ర నిర్మాతలకు స్పష్టంగా తెలియజేసినట్లు చెప్పారు. టైటిల్, పాత్ర పేరును మార్చాలని బోర్డు చిత్రబృందానికి సూచించినట్లు తెలిపారు. దాదికి గురైన మహిళ పాత్రకు సీతాదేవి పేరును పెట్టలేమని బోర్డు చెప్పిందన్నారు. ఇటీవల మరో మలయాళ చిత్ర నిర్మాత తన సినిమాలో జానకి అనే పాత్ర పేరు విషయంలో ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. వారు సెన్సార్ సర్టిఫికెట్ పొందడానికి ఆ పేరును 'జయంతి'గా మార్చారని తెలిపారు. థ్రిల్లర్ కథాంశంతో 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ రూపొందింది. సత్యం ఎప్పటికైనా విజయం సాధిస్తుందనేది ఉప శీర్షిక. ఇందులో జానకిగా అనుపమ కనిపించనున్నారు. లాయర్గా ప్రముఖ నటుడు సురేశ్ గోపి నటించారు. జూన్ 27న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

నేనూ ఓటీటీకి రెడీ.. చిరు ఆసక్తికర కామెంట్స్

స్టార్ హీరో చిరంజీవి ఓటీటీలోకి ఎంట్రీపై కామెంట్స్ చేశారు. మంచి పాత్ర ఉంటే తాను సిద్ధమేనన్నారు.

తాను కూడా 'కుబేర భవిష్యత్తులో చేయాల్సి వచ్చినా రెడీ.. ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమేనన్నారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. తాజాగా జరిగిన సక్సెస్ మీట్లో తన స్పీచ్ అందరినీ ఉత్సాహపరిచిన ఆయన నాగార్జునపై ప్రశంసల వర్షం కురిపించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. నాగ్ తనకు ఎన్నో విషయాల్లో స్ఫూర్తినిస్తుంటారని చెప్పారు. "నాగార్జున ఎన్నో విషయాల్లో నాలో స్ఫూర్తినింపుతుంటారు. ఆరోగ్యం, నడవడిక, ఆలోచనలు, స్థితప్రజ్ఞత.. ఇలా ఎన్నో విషయాలు ఆయనలో నాకు నచ్చుతాయి. ఏం జరిగినా ఎంతో ప్రశాంతంగా ఉంటాడు. నేను కూడా ఏమైనా అవసరం వచ్చి ఓటీటీలో సినిమాలు దానికి ఇప్పటినుంచే మానసికంగా సిద్ధంగా ఉండాలి. ఈ విషయంలోనూ నాగార్జున తీసుకున్న నిర్ణయం నాకు స్ఫూర్తి. ఓకే అన్నాను కదా అని రేపు ఉదయాన్నే స్క్రిప్టు తీసుకొని వచ్చేయకండి" అంటూ సరదాగా చెప్పారు చిరంజీవి. ప్రస్తుతం ఈ కామెంట్స్ వైరల్ గా మారాయి. త్వరలోనే ఆయన్ను ఓటీటీలో కూడా చూడొచ్చని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే సీనియర్ హీరోలంతా ఏదోరకంగా ఓటీటీ ప్రేక్షకులకు దగ్గరైన విషయం తెలిసిందే. పలు కార్యక్రమాలకు బాలకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ ఆకట్టుకుంటున్నారు. వెంకటేశ్ 'రానా నాయుడు'తో అలరించారు. ఇక చిరు కూడా ఓటీటీలోకి ఎంట్రీ ఇస్తున్నారని గతేడాది వార్తలు వచ్చాయి. ఓటీటీలో తెరకెక్కే ప్రాజెక్టుకు కథే బలం. అందుకే బలమైన కథ కోసం వెతుకుతున్నారని.. కొంతమంది రచయితలకు చిరంజీవి తన వయసుకు తగిన బలమైన కథ రాయాలని సూచించినట్లు కూడా అప్పట్లో వార్తలు వచ్చాయి. తాజాగా ఈ ఓటీటీ కామెంట్స్ పై మరోసారి ఈ విషయం తెర పైకి వచ్చింది.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188, 9985876888

ప్రకటన

ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాప్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501

డోర్ నెం:46/181/జి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001

బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

బుమ్రా ఈ సిరీస్ లో మూడు కంటే ఎక్కువ మ్యాచ్లు ఆడతాడా?

టీమ్ ఇండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్తో మ్యాచ్ అనంతరం చేసిన వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆశ చిగురిస్తోంది! అతడు ఈ సిరీస్లో మూడు కంటే ఎక్కువ మ్యాచ్లు ఆడే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీం ఇండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్ మ్యాచ్ అనంతరం చేసిన వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అతడు ఈ సిరీస్లో మూడు కంటే ఎక్కువ మ్యాచ్లు ఆడే అవకాశం ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుమ్రా తొలి ఇన్నింగ్స్ లో 83 పరుగులు ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడు. మిగతా బౌలర్లు మాత్రం మరో 5 వికెట్లు తీయడానికి 382 పరుగులు సమర్పించుకున్నారు. తన అద్భుత ప్రదర్శన అనంతరం బుమ్రా మాట్లాడిన వీడియోను బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసింది. ఇంగ్లండ్ లో వాతావరణం బాగుందంటూ అతడు అందులో అన్నాడు. 'ఇది చాలా బాగుంది. భారత్లో కన్నా ఇక్కడ కాస్త చల్లగా ఉంది. నేను ఉత్సాహంగా ఉన్నాను. కాబట్టి మంచి విషయాలు జరుగుతాయి అని ఆశిస్తున్నా' అని బుమ్రా మాట్లాడాడు. దీంతో ఈ సిరీస్లో బుమ్రా మొదట అనుకున్న మూడు కంటే ఎక్కువ మ్యాచ్లు ఆడే అవకాశముందని అభిమానులు ఓ అంచనాకు వస్తున్నారు. 'ఇక్కడ వాతావరణం చల్లగా ఉండటం వల్ల ఫీల్డర్లు క్యాచ్లు అందుకోవడానికి కాస్త ఇబ్బంది పడుతున్నారు' అని బుమ్రా చలి వల్ల ఎదురవుతున్న ఇబ్బందుల గురించి కూడా ప్రస్తావించాడు.

'క్యాచ్లు డ్రాప్ అయ్యాయని ఏడుస్తూ కూర్చోలేం కదా!'

లీడ్స్లో లోని హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్ తో జరుగుతున్న ఈ మ్యాచ్లో టీమ్ ఇండియా ఫీల్డర్లు పలు క్యాచ్లు డ్రాప్ చేశారు. దీనిపై కూడా బుమ్రా స్పందించాడు. 'క్యాచ్లు డ్రాప్ అయ్యాయని ఏడుస్తూ కూర్చోలేం కదా! అక్కడే ఆగిపోకుండా.. ఆటలో ముందుకుసాగిపోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మాలో చాలామంది కొత్తగా జట్టులోకి వచ్చారు. కాబట్టి ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడటానికి కాస్త సమయం పడుతుంది. కావాలని ఎవరూ క్యాచ్లు డ్రాప్ చేయరు కదా! క్రికెట్లో ఇలాంటివి సహజం. వాటి నుంచి వారు నేర్చుకుంటారు. నేను బాధతో బంతిని తన్ని లేదా ఆగ్రహం వ్యక్తం చేసి వారి మీద మరింతగా ఒత్తిడి పెంచాలనుకోవడం లేదు' అని బుమ్రా భారత ఫీల్డర్లకు మద్దతుగా నిలిచాడు. అలాగే తాను కెప్టెన్సీ ఎందుకు తీసుకోలేదన్న విషయం పైనా అతడు స్పందించాడు. 'కెప్టెన్సీలో పెద్దగా ఏమీ లేదు. నా శరీరాన్ని జాగ్రత్తగా చూసుకోవాలనుకుంటున్నాను. నాకు శస్త్రచికిత్స చేసిన డాక్టర్లతో నేను చర్చలు జరిపాను. వారి సూచన మేరకే.. ఆలోచించి నేను ఈ నిర్ణయానికి వచ్చా. కెప్టెన్సీ తీసుకుంటే నేను ప్రతి మ్యాచ్లోనూ ఆడాల్సి ఉంటుంది. అలా చేయకుంటే అది న్యాయం కాదు. జట్టును నిరాశపరచడం నాకు ఇష్టం లేదు. టీమ్ ఇండియాకు ఓ ఆటగాడిగానే సేవలు అందించాలనుకుంటున్నాను. మ్యాచ్లు గెలవడం కంటే ఇంకేదీ పెద్ద విషయం కాదు' అని బుమ్రా అన్నాడు.

30 నిమిషాల పాటు నడక లేదా యోగా, ఏది చేస్తే బరువు తగ్గుతారో తెలుసా?

ఫిట్నెస్

చాలా మంది వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. కానీ, ఏ వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుందో చాలా మందికి తెలియదు. కొంతమంది వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదని నమ్ముతారు. మరికొందరు యోగాకి ఓటేస్తున్నారు.

ప్రస్తుత మారుతున్న జీవనశైలి, పొల్యూషన్, తిండి అలవాట్ల కారణంగా జీవితంలో ఫిట్గా, ఆరోగ్యంగా ఉండటం సవాల్తో కూడుకుంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటారు. చాలా మంది వ్యాధులకు దూరంగా ఉండాలని అనేక ప్రయత్నాలు చేస్తారు. అయితే, చాలా మంది వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. కానీ, ఏ వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుందో చాలా మందికి తెలియదు. కొంతమంది వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదని నమ్ముతారు. బ్రిస్క్ వాకింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని, కేలరీలు త్వరగా బర్న్ అవుతాయని భావిస్తారు. మరోవైపు ఇంకొందరు యోగా శరీరం, మనస్సు రెండింటినీ ఆరోగ్యంగా ఉంచుతుందని నమ్ముతారు. అయితే, ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి మంచిది, వాటి ఆరోగ్య ప్రయోజనాలేంటో, ముప్పై నిమిషాల పాటు వాకింగ్ లేదా యోగా చేస్తే ఏమవుతుందో ఇక్కడ తెలుసుకుందాం.

గుండె ఆరోగ్యం

ప్రతి రోజూ ముప్పై నిమిషాలు నడవడం వల్ల హృదయ స్పందన రేటు తగ్గుతుంది. రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి రోజూ వేగంగా నడిచే వారిలో గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం 30 శాతం తగ్గుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

బరువు తగ్గవచ్చు

బరువు తగ్గడానికి వాకింగ్ బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. బరువు తగ్గడానికి సులభమైన, ప్రభావవంతమైన మార్గం వాకింగ్. ఒక సాధారణ నడక 150 నుంచి 200 కేలరీలను బర్న్ చేస్తుంది. వేగంగా నడిస్తే బర్న్ అయ్యే కేలరీల సంఖ్య మరింత పెరుగుతుంది. ప్రతి రోజూ క్రమం తప్పకుండా వాకింగ్ చేయడం వల్ల బరువు తగ్గవచ్చంటున్నారు నిపుణులు.

డయాబెటిస్ పేషంట్లకు మేలు

ముప్పై నిమిషాల నడక వల్ల డయాబెటిస్ పేషంట్లకు మేలు జరుగుతుంది. నడక రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రిస్తుంది. టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా రక్తపోటును సాధారణంగా ఉంచడంలో సాయపడుతుంది. రెగ్యులర్ వాకింగ్ స్ట్రోక్, ఇతర వ్యాధుల్ని కూడా నివారిస్తుంది.

మానసక ఆరోగ్యానికి ఒక వరం

ఈ రోజుల్లో బిజీ లైఫ్స్టైల్, వర్క్ లైఫ్ కారణంగా చాలా మంది ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి వాకింగ్ బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ అరగంట నడవడం వల్ల మానసిక ఆరోగ్యం మెరుగపడుతుంది. రెగ్యులర్ వాకింగ్ వల్ల మెదడులో ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. ఎండార్ఫిన్లు మానసిక స్థితిని మెరుగుపర్చి.. ఒత్తిడిని తగ్గించడంలో సాయపడతాయి.

శరీరాన్ని బలంగా మారుస్తుంది

యోగా చేయడం వల్ల శరీరం ఫ్లెక్సిబుల్గా మారుతుంది. అంతేకాకుండా రెగ్యులర్ యోగా వల్ల కండరాలు బలపడతాయి. శరీర భంగిమ కూడా మెరుగుపడుతుంది. వెన్నునొప్పి, మెడ నొప్పి, కీళ్ల నొప్పుల వంటి సమస్యలు ఉపశమనాన్ని యోగా అందిస్తుంది. యోగా చేయడం వల్ల ఈ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

మానసిక ప్రశాంతత



యోగా శరీరానికి మాత్రమే కాకుండా మనసుకు కూడా విశ్రాంతినిస్తుంది. రోజూ యోగా చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. ఇది మానసిక ప్రశాంతతను ఇస్తుంది. ధ్యానం, ప్రాణాయామం చేయడం వల్ల మెదడు యాక్టివ్గా మారుతుంది. ఇది మిమ్మల్ని రోజంతా యాక్టివ్గా మారుస్తుంది.

జీర్ణవ్యవస్థ మెరుగు

పవనముక్తాసనం, భుజంగాసనం, వజ్రాసనం వంటి కొన్ని యోగా భంగిమలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. గ్యాస్, అసిడిటీ లేదా అజీర్ణం వంటి జీర్ణ సమస్యలతో బాధపడేవారికి యోగా బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. అంతేకాకుండా రోజూ యోగా చేయడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. జలుబు, అలెర్జీలు, ఇతర ఇన్ఫెక్షన్లు రాకుండా రోగనిరోధక శక్తి కాపాడుతుంది.

రెండింటిలో ఏది బెస్ట్?



మీ లక్ష్యం బరువు తగ్గడం, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, మధుమేహం వంటి వ్యాధులను నియంత్రించడం అయితే, నడక మరింత ప్రభావవంతంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత, సౌకర్యవంతమైన శరీరం, అంతర్గత బలం కావాలంటే, యోగా ఉత్తమమైనది.

రెండింటినీ కలపడం ఇంకా బెస్ట్



దినచర్యలో నడక, యోగా రెండింటినీ చేర్చుకుంటే ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. ఉదయం 15-20 నిమిషాలు యోగా చేసి, ఆపై 20-30 నిమిషాలు నడవండి. వారానికి 3 రోజులు యోగా, 3 రోజులు నడకను మీ జీవనశైలిలో భాగం చేసుకోండి. మీరు బిజీగా ఉండి సమయం తక్కువగా ఉంటే, ఈ రెండింటిలో ఏదైనా ఒక దాన్ని ఎంచుకుని క్రమం తప్పకుండా చేయండి.

గమనిక:ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.